సాక్షి అనకాపల్లి

శుక్రవారం : 24 : జనవరి : 2025

I

మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ అనకాపల్లి మండలం సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేత్రాన్ని సందర్శించారు. సామూహిక అనఘా వ్రతం, 32 గణపతుల ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుగ్రహ భాషణం చేస్తూ.. జన్మించినప్పుడు తీసుకు వచ్చేది ఏమీ ఉండదని, మరణించినప్పుడు తీసుకుని పోయేదీ ఏమీ ఉండదని, ఈ సత్యం తెలుసుకుంటే అత్యాశ, అహంకారాలకు తావుండదని ఉద్బోధించారు.

ఆ సత్యం తెలిస్తే..

IIలో



చోడవరంలో ఏపీ ట్యాక్స్ పెందుర్తిలో పీఆర్

- చోడవరంలో టన్నుకు రూ.250 చొప్పున వసూలు
- రోజుకు రూ.10 లక్షలు.. నెలకు రూ.3 కోట్లు వసూలు
- పక్క నియోజకవర్గ నేత ప్రమేయంపై విమర్శలు
- పెందుర్తి దరి నరవలో ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్
- కూటమి నేతకు ట్రిప్పునకు కొంత చొప్పన చెల్లింపు



రోలుగుంట మండలంలో టిప్పర్లలో గ్రావెల్ తరలింపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు ఎక్కడికక్కడ అనుమతిస్తూ... తమ సొంత ట్యాక్స్‌లను వసూలు చేస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఒక్కో ట్రిప్పునకు రూ.22 వేలు చొప్పున కూటమి నేతలు వసూలు చేస్తుండగా.. చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో 'ఏపీ' ట్యాక్స్, 'పీఆర్' ట్యాక్స్ పేరుతో వసూలుకు తెగబడటం చర్చనీయాంశమైంది. చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట మండలంలో అధికార, అనధికార క్వారీల నుంచి తరలివెళ్లే కంకరతోపాటు బండరాళ్లకు ప్రతీ టన్నుకు రూ.250 చొప్పున 'ఏపీ' ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తున్నారు. అయితే పక్కనున్న నియోజకవర్గ నేత పేరుతో టిప్పరు, ట్రాక్టరు యజమానుల నుంచి ఈ ట్యాక్స్ వసూలు చేస్తుండటం గమనార్హం. ఇక పెందుర్తి నియోజకవర్గంలోని నరవ ప్రాంతంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు రాత్రి, పగలనకుండా ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఏకంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ), అటవీశాఖ భూముల్లోనే ఈ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలు చేపడుతున్న వ్యక్తులు... కూటమి నేతకు 'పీఆర్' ట్యాక్స్ చెల్లిస్తున్నారు. దీంతో మైనింగ్ అధికారులు ఎవరూ అటువైపుగా కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి.

నెలకు రూ.3 కోట్లు వసూలు!

చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో చేపడుతున్న అధికార, అనధికార మైనింగ్ ద్వారా ప్రతీ రోజూ పదుల సంఖ్యలో లారీల నుంచి కంకర తరలివెళుతోంది. ఇక స్థానిక అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా కూడా తరలిస్తున్నారు. గుర్తింపు ఉన్న క్వారీల నుంచి తరలిస్తున్న వాటికి సీనరేజీ కింద ప్రభుత్వం వసూలు చేసే మొత్తానికి అదనంగా టన్నుకు రూ. 250 వసూలు చేస్తున్నారు. పక్క నియోజకవర్గానికి చెందిన కూటమి నేత పేరుతో 'ఏపీ' ట్యాక్స్‌గా అధికారికంగా ఈ మొత్తాన్ని వసూలు చేస్తుండటం గమనార్హం. అంటే ఇక్కడ ప్రతీ రోజూ రూ.10 లక్షలు.. నెలకు రూ.3 కోట్ల మేర వసూలు చేస్తున్నారు. నిబంధనల మేరకు ఒక్కో లారీ నుంచి 20 టన్నుల కంకరను తరలించాల్సి ఉండగా.. 30 టన్నుల వరకు తరలించేస్తున్నారు. తద్వారా ఒక్కో టన్నుకు అదనంగా రూ. 250 చెల్లించి.. అధిక లోడును తీసుకెళ్లేందుకు టిప్పరు యాజమాన్యాలకు కూటమి నేతలు అనుమతిస్తున్నారు. ఇక్కడి నుంచి తరలించే ఏ వాహనాన్ని కూడా అటు మైనింగ్ అధికారులు కానీ.. ఇటు రవాణాశాఖ అధికారులు కానీ ఆపేందుకు సాహసించడం లేదు.



క్వారీలో టిప్పర్లలో బండ రాళ్లు ఎక్కిస్తున్న పొక్లెయిన్

అధిక లోడుకు అనధికారికంగా అనుమతి లభిస్తుండటంతో సదరు టిప్పరు యజమానులు కూడా రూ.250 మొత్తాన్ని చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. ట్రాక్టర్ యజమానులు కూడా టన్నుకు రూ.250 చొప్పున చెల్లించి అదనపు లోడును తీసుకెళుతున్నారు. అయితే సదరు టిప్పరు, ట్రాక్టర్ యజమానులు.. ఇంటి నిర్మాణదారులు, ఎన్ఆర్ఈజీఎస్, రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై భారం మోపుతున్నారు. తద్వారా ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతోందని నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో పాటు డ్రైనేజీ నిర్మాణంలో అదనపు భారాన్ని మోయాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు కూడా గగ్గోలు పెడుతున్నారు.

గుంతలు తవ్వినా...!

పెందుర్తి నియోజకవర్గం నరవ ప్రాంతంలో చెరోవైపు పంచుకొని మరీ కూటమి నేతలు గ్రావెల్ తవ్వకాలను చేపడుతున్నారు. వాస్తవానికి ఈ భూమి ఏపీఐఐసీతో పాటు అటవీశాఖకు చెందినది. ఇక్కడా గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేదని మైనింగ్ అధికారులు కూడా పేర్కొంటున్నారు. దీనిపై గతంలో 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. దీంతో అప్పటి తహసీల్దార్ అక్కడకు వెళ్లి వాహనాలు వెళ్లకుండా అడ్డుగా గుంతలు తవ్వారు. ఇప్పుడు ఆ గుంతలను పూడ్చడంతో పాటు కూటమి నేతలు చెరోవైపు రాత్రి, పగలు తేడా లేకుండా భారీగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ప్రస్తుత తహసీల్దారు అటువైపుగా కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇక మైనింగ్ అధికారుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ఇంత దర్జాగా తవ్వకాలు సాగుతుండటానికి కారణం సదరు వ్యక్తులు.. స్థానిక నియోజకవర్గ కూటమి నేతకు 'పీఆర్' ట్యాక్స్ పేరుతో ట్రిప్పునకు ఇంత మొత్తం చెల్లిస్తుండటమే. మొత్తంగా కూటమి నేతలు ఎక్కడికక్కడ స్థానికంగా ట్యాక్స్ పేరుతో వసూళ్లకు తెగబడుతుండటం చర్చనీయాంశమవుతోంది.



నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు



ఎమ్మెల్యే రాజుతో కలసి చలిసింగం గిరిజన గ్రామానికి కాలినడకన వెళుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలే లక్ష్యం

- కలెక్టర్ విజయ కృష్ణన్
- కాలినడకన గిరిజన గ్రామాల సందర్శన
- రహదారి పనుల వేగవంతానికి ఆదేశాలు

రోలుగుంట : గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేని విధంగా రహదారులు ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. రావికమతం, రోలుగుంట మండలాల్లోని గిరిజన గ్రామాలను ఎమ్మెల్యే రాజుతో కలిసి గురువారం ఆమె సందర్శించారు. రావికమతం మండలం చలిసింగం గిరిజన గ్రామానికి మూడు కిలోమీటర్లు కాలినడకన చేరుకున్నారు. సుమారు 300 మంది జనాభా కలిగిన ఈ గ్రామానికి వెళ్లాలంటే కాలిబాటే శరణ్యం. గతేడాది జనవరిలో ఈ రహదారి నిర్మాణానికి రూ.2.65 కోట్లు, రోలుగుంట మండలం అర్ల గిరిజన పంచాయతీ శివారు లోసింగి వద్ద పెదగరువు నుంచి వై.బి.పట్నం వరకూ ఉపాధి హామీ పథకం నుంచి రూ.2 కోట్ల 50 లక్షలు మంజూరయ్యాయి. టెండరు కూడా పూర్తయింది. అయితే ఈ రోడ్డు అటవీ ప్రాంతంలో ఉన్నందున అటవీ శాఖ అధికారులు రోడ్డుకు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ అభ్యంతరాలు తొలగించి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు. గ్రామస్థులు కూడా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు ఆధ్వర్యంలో పలు రూపాల్లో నిరసనలు, విజ్ఞప్తులు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అభ్యంతరాలను పక్కన పెట్టి రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేస్తున్నట్టు చలిసింగం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ప్రకటించారు.

తరువాత రోలుగుంట మండలంలో గల అర్ల పంచాయతీ శివారు లోసింగి గిరిజన గ్రామం కాలినడకన చేరుకున్నారు. తహసీల్దార్ ఎస్.నాగమ్మతో ఇక్కడ సమస్యలు తెలుసుకున్నారు. ఇక్కడ నుంచి వై.బీ.పట్నం వరకూ రహదారి కోసం మంజూరైన రూ.2.50 కోట్ల నిధులతో రహదారి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, రావికమతం, రోలుగుంట తహసీల్దార్లు బి.వెంకటరమణ, ఎస్.నాగమ్మ, చోడవరం జనసేన ఇంచార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు, రావికమతం టీడీపీ అధ్యక్షుడు కొండనాయుడు, చీమలపాడు సర్పంచ్ గంగరాజు, శరభవరం పంచాయితీ సర్పంచ్ పంచాడ చంద్ర, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, కొత్తకోట, రోలుగుంట ఎస్ఐలు ఎం.శ్రీనివాస్, పి.రామకృష్ణారావు పాల్గొన్నారు.



గ్రామ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

ఓపీఆర్‌లో జిల్లా ఆర్టీసీకి ప్రథమ స్థానం

- ప్రశంసాపత్రం అందుకున్న జిల్లా అధికారి పద్మావతి

అనకాపల్లి: ఆన్‌లైన్ పాసింజర్ రిజర్వేషన్ (ఓపీఆర్) అమలుతోపాటు సరైన సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో జిల్లా ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది నవంబర్ 11 నుంచి డిసెంబర్ 15వ తేదీల మధ్య 95 శాతం ఫలితాలతో అనకాపల్లి జిల్లాను మొదటి స్థానంలో నిలిపినందుకు గురువారం విజయవాడలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు జిల్లా అధికారి కె.పద్మావతికి ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో తమ శాఖ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించి, ప్రయాణికుల మన్ననలను పొందడం వలన రాష్ట్రంలో మొదటి స్థానం సాధించగలిగామన్నారు. రానున్న రోజుల్లో తమ సిబ్బంది సహకారంతో మరిన్ని ప్రశంసాపత్రాలను తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.




ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జిల్లా ఆర్టీసీ అధికారి పద్మావతి

న్యూస్‌రీల్

వ్యవసాయ బోరుకు రూ.17 వేల బిల్లు

- కట్టకపోతే ఇంటి కనెక్షన్ కట్ చేస్తామంటూ విద్యుత్ శాఖ బెదిరింపులు



వ్యవసాయ బోరు వద్ద విద్యుత్ బిల్లుతో శీరంశెట్టి రమేష్, (ఇన్‌సెట్) బోరుకు వచ్చిన రూ.17,156 విద్యుత్ బిల్లు

తుమ్మపాల: సాధారణ పేద రైతు శీరంశెట్టి రమేష్ వ్యవసాయ బోరుకు రూ.17 వేలకుపైగా విద్యుత్ బిల్లు రావడంతో లబోదిబోమంటున్నాడు. 40 ఏళ్ల క్రితం నుంచి వ్యవసాయ బోరు (సర్వీస్ నంబరు 11727 04001001839) ఉందని, ఉచిత విద్యుత్ సౌకర్యంతో వరి సాగు, ఒక పశువును పోషించుకుంటున్నానని చెప్పాడు. వ్యవసాయం చేస్తూ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకురావడమే కష్టంగా ఉన్న తమను విద్యుత్ సిబ్బంది వేధిస్తున్నారంటూ కంటతడి పెడుతున్నాడు. గతేడాది డిసెంబర్‌లో ఇన్‌స్పెక్షన్ అంటూ అధికారులు వచ్చి చూసి వెళ్లిపోయారని, తీరా చూస్తే రూ.13 వేల బిల్లు చెల్లించాలని డిమాండ్ నోటీసు పంపించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై సదరు సిబ్బందిని ప్రశ్నించగా, తమకు పశువుల డెయిరీ ఉందని నమోదైనట్లు, ప్రభుత్వాన్ని మోసం చేసి ఉచిత వ్యవసాయ బోరు వినియోగిస్తున్నామని, ఇన్‌స్పెక్షన్ అధికారులు తనపై కేసు నమోదు చేశారని లబోదిబోమంటున్నాడు. నేటికి దాదాపు రూ.17 వేల చిల్లర చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, చెల్లించని క్రమంలో ఇంటి నివాసానికి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రమాదం అంచున పూడిమడక

- ఫిషింగ్ హార్బర్ కోసం సముద్రపు ఒడ్డున తీసిన గొయ్యి
- గట్టు బలహీనపడడంతో భవిష్యత్తులో విపత్కర పరిస్థితులు
- నిర్మాణ వ్యయం తగ్గిస్తే గొయ్యి తవ్వకం వృథా

అచ్యుతాపురం:

రాష్ట్రంలోనే అతి పెద్ద జాలారి పల్లెగా గుర్తింపు ఉన్న పూడిమడకకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఈ సముద్ర తీరానికి భారీ గొయ్యి ఒక ప్రశ్నగా మారింది. పూడిమడక గ్రామంలో నిర్మించిన లైట్ హౌస్ నుంచి మొగ వైపు ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.393 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఫిషింగ్ హార్బర్ కాంట్రాక్టు దక్కించుకున్న నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సముద్రపు ఒడ్డున భారీ గొయ్యి తీశారు. దీనికి అనుసంధానంగా రహదారి నిర్మించారు. నార్త్ బ్రేక్ వాటర్ కోసం మత్స్యశాఖ గొయ్యి తీసినట్టు పేర్కొంటున్నారు. ఆ గోతిలోంచి తీసిన గ్రావెల్‌ను తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న లోతట్టు రహదారి మత్స్యశాఖ పరిభాషలో హార్బర్ అంతర్గత రహదారి. ఇంత వరకూ బాగానే ఉన్నప్పటికీ సదరు గోతిలోంచి తీసిన గ్రావెల్ ఎక్కడికెళ్లిందనేది అంతు చిక్కని ప్రశ్న. ఈ విషయంలో చాలా వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు సాగరమాల ప్రాజెక్టులో భాగంగా సముద్ర తీర ప్రాంతాల్లో నిర్మించే ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణ వ్యయాన్ని అవకాశం ఉన్నంత మేరకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈమేరకు సైకప్ సంస్థ పరిశీలన జరిపి నిర్మాణ వ్యయాన్ని రూ.140 కోట్లకు తగ్గించవచ్చని పేర్కొంది. ఇదే జరిగితే మత్స్య శాఖ చెబుతున్నట్టు నార్త్ బ్రేక్ వాటర్ కోసం తీసిన గోతిని మళ్లీ పూడ్చాల్సిందే. నిర్మాణ వ్యయం తగ్గితే ప్లాన్ మారుతుంది. గతంలో తవ్విన గొయ్యి వృథా అవుతుంది.



నార్త్ బ్రేక్ వాటర్ కోసం తీశారని చెబుతున్న భారీ గొయ్యి ఇదే (ఇన్‌సెట్) గ్రావెల్ తరలించిన హార్బర్ అంతర్గత రహదారి

పొంచి ఉన్న ప్రమాదం

హార్బర్ నిర్మాణ వ్యయం తగ్గించాలని ప్రభుత్వం ప్రతిపాదన చేసిన నేపథ్యంలో సముద్రం ఒడ్డున తీసిన గొయ్యి ప్రశ్నార్థకంగా మారింది. సహజసిద్ధంగా ఏర్పడిన బలమైన ఒడ్డును చీల్చి గొయ్యి తవ్వడంతో రానున్న కాలంలో పూడిమడకకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. గట్టు బలహీనపడటం వల్ల భవిష్యత్‌లో దీని ద్వారా సముద్ర నీరు పోటు వస్తే పూడిమడక గ్రామానికి ప్రమాదం. ప్రకృతి సమతుల్యతతో ఏర్పడిన ఈ బలమైన గట్టును ఎటువంటి ప్రమాణాలు పాటించకుండా తవ్వేశారు. మత్స్యశాఖ, తీర ప్రాంత రక్షణ దళం, మారిటైం బోర్డు, మెరైన్ విభాగం అత్యంత సున్నితంగా పరిశీలించి ప్రభుత్వానికి తగిన నివేదిక ఇవ్వకుంటే రానున్న కాలంలో పూడిమడకకు మరిన్ని కష్టాలు పొంచి ఉన్నాయి.

నార్త్ బ్రేక్ వాటర్ కోసం తీసిందే..

ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో భాగంగా నార్త్ బ్రేక్ వాటర్ కోసం ఆ గొయ్యిని తీశారు. అక్కడి గ్రావెల్ ఎక్కడికెళ్లిందో మాకు తెలీదు. అది మా పరిధిలోది కాదు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణ అంచనా వ్యయాన్ని తగ్గించాలని సైకప్ సంస్థ ద్వారా సర్వే చేశారు. ఇవన్నీ మారిటైం బోర్డు, ప్రభుత్వ పరిధిలోనివి. ప్రస్తుతానికి ఆ గొయ్యి వల్ల ఎటువంటి ప్రమాదం లేదు.

–రవితేజ, అచ్యుతాపురం డివిజన్ మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

వచ్చే నెల ఏలేరు కాలువలో పూడికతీత పనులు

- 10వ తేదీ నుంచి నీరు నిలుపుదల
- చీఫ్ ఇంజినీరు శివ ప్రసాదరాజు



పెదగొలుగొండపేట వద్ద ఏలేరు కాలువను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్‌రాజు ఈఈ మురళీకృష్ణ

నాతవరం : వచ్చే నెల 10వ తేదీ నుంచి ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేస్తామని చీఫ్ ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు అన్నారు. మండలంలో ఆయన గురువారం పెదగొలుగొండపేట, ఎ.శరభవరం, మన్య పురట్ల, పాములవాక గ్రామాల వద్ద ఏలేరు కాలువలో పేరుకుపోయిన పూడికతో పాటు శిథిలమైన కాలువ గట్లు పరిశీలించారు. రూ.8 కోట్లతో ఏలేరు కాలువలో పూడిక తొలగించడంతో పాటు పలుచోట్ల శిథిలమైన కాలువ గట్లు పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 10 తేదీ నుంచి మార్చి వరకు ఏలేరు కాలువలో నీరు నిలుపుదల చేస్తామన్నారు. ఏలేరు కాలువలో నీటిని నిలుపుదల చేసే సమయంలో విశాఖలో ప్రజలు తాగునీటిని ఇతర పరిశ్రమలకు సంబంధించి నీటిని నిల్వ చేసుకోవాలని ముందస్తుగా చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఈ మురళీకృష్ణ , డీఈ గోపాలకృష్ణ, జేఈలు నానాజీ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, విస్కో అడ్వైజర్ జగన్నాథరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట(విశాఖ) : మండల స్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈవో) పి.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పరిపాలన అధికారులకు ఈ ఆఫీస్ నిర్వహణ, కార్యాలయ రికార్డులు, నిధుల వినియోగం, సాంకేతిక అంశాలపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ వివిధ పద్దుల కింద ఉన్న నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తిగా ఖర్చు చేయాలన్నారు. మండల ప్రజా పరిషత్ రికార్డుల నిర్వహణ, వాటి ప్రాముఖ్యతపై సంబంధిత ఎంపీడీవోలు దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ అధికారి శ్వేత పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జీఎస్టీపై అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఉమ్మడి విశాఖ జిల్లాల ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆ సత్యం తెలిస్తే అత్యాశ, అహం దరిచేరవు



చింతామణి గణపతి దత్తక్షేత్రంలో అనఘా వ్రతం చేస్తున్న 1008 మంది దంపతులు (ఇన్‌సెట్) అనుగ్రహ భాషణం చేస్తున్న మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ

- మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ
- గణపతి దత్త క్షేత్రంలో సామూహిక అనఘా వ్రతం ప్రారంభం

అనకాపల్లి: జన్మించినప్పుడు తీసుకువచ్చేది ఏమీ ఉండదని, మరణించినప్పుడు తీసుకుని పోయేదీ ఏమీ ఉండదని, ఈ సత్యం తెలుసుకుంటే అత్యాశ, అహంకారాలకు తావుండదని మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేత్రంలో గురువారం గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీలు 1008 మంది దంపతులతో సామూహిక అనఘా వ్రతం, 32 గణపతుల ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ దత్తాత్రేయుడు జ్ఞానాన్ని పెంపొందించి ఉన్నత శిఖరాలకు చేరుస్తారన్నారు. లోక కల్యాణార్థం గణపతి రూపాల్లో ఇది కూడా ఒకటని, ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి చింతలు లేకుండా గణపతి రక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. పిల్లల్లో సనాతన ధర్మాన్ని పెంపొందించాలన్నారు. అందరూ సుఖమే కావాలనుకుంటున్నారు గానీ, భక్తిని కోరుకోవడం లేదన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసే ప్రతి వ్యక్తి తన ధర్మాన్ని పాటిస్తే గౌరవ ప్రతిష్ఠలు బలపడతాయన్నారు. అంతకు ముందు స్వామీజీ గణపతి పూజ, పుణ్యాహవచనం పంచగవ్య ప్రాశన, మహా సంకల్పం, ఆంజనేయ స్వామి విశిష్టతను వివరిస్తూ భక్తులకు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతామణి గణపతి దత్త క్షేత్రం ట్రస్ట్ నిర్వాహకుడు ఎం.ఆంజనేయరాజు, ప్రతినిధులు సి.పి.రామారావు, ఎస్.మహేష్‌కుమార్, ఎ.రవికుమార్, ఇంద్రలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోమాతకు దాణా తినిపిస్తున్న మైసూర్ దత్త విజయానంద తీర్థ స్వామీజీ

కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ శత ఉత్సవాల్లో భాగంగా గురువారం మైసూర్ దత్త విజయానంద తీర్థ స్వామీజీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గోషాలకు వెళ్లి గోమాతకు దాణా తినిపించారు. అనంతరం కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని స్వామీజీకి అందజేశారు. ఈ సందర్భంగా స్వాజీ మాట్లాడుతూ గుడి బడితో సమానమన్నారు ఈ కార్యక్రమంలో ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ

- ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి
- రోడ్డు భద్రత మాసోత్సవాల్లో కలెక్టర్ విజయ కృష్ణన్



రింగ్ రోడ్డులో రోడ్డు భద్రత మాసోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. స్థానిక రింగ్ రోడ్డులో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం చేపట్టిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. రింగ్ రోడ్డు నుంచి చేపల బజార్, పెరుగు బజార్, వేలువీధి జంక్షన్, నెహ్రూచౌక్ వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'శ్రద్ధ వహించడండి'అనే నినాదంతో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలు ఈ నెల 16 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. 75 శాతం రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాల వల్లే కారణమన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి చర్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరమని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, రోడ్డు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.వి జయకుమార్, ఎం.వెంకటనారాయణ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ చోరీ గుట్టురట్టు

నర్సీపట్నం: నర్సీపట్నంలో వంట గ్యాస్ చోరీ గుట్టురట్టు అయింది. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సిలిండర్లలోని కొంత గ్యాస్‌ను తీసేసి వినియోగదారులకు అంటగడుతున్న వ్యవహారం గురువారం బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డెలవరీ బాయ్ నానాజీ సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయడానికి ముందు నిత్యం ఎస్సీ కాలనీలోని తన ఇంటికి తీసుకొస్తున్నాడు. ప్రతి సిలిండర్ నుంచి దాదాపు 4 కేజీల గ్యాస్ తీసి తన దగ్గర ఉన్న వేరే సిలిండర్‌లో నింపుకొంటున్నాడు. సిలిండర్ సీల్‌ను అనుమానం రాకుండా యథావిధంగా అమర్చుతున్నాడు. ఇలా తక్కువ బరువు ఉన్న సిలిండర్లను వినియోగదారులకు కొంత కాలంగా సరఫరా చేస్తున్నాడు. నిత్యం సిలిండర్లను ఇంట్లోకి తీసుకెళ్లి తీసుకొస్తుండడంతో అనుమానం వచ్చిన అదే కాలనీకి చెందిన ఎస్.తలుపులు ఇంట్లోకి వెళ్లి చూడడంతో గ్యాస్ చోరీ బండారం బయటపడింది. వెంటనే తలుపులు స్థానిక విలేకరులతో పాటు హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకులకు తెలియజేశాడు. ఏజెన్సీ నిర్వాహకుడు బుచ్చిరాజు, సిబ్బంది వచ్చి నానాజీ ఇంట్లో ఉన్న నాలుగు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.



బాయ్ ఇంట్లో సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న ఏజెన్సీ నిర్వాహకులు

వివాహిత అదృశ్యం

యలమంచిలి రూరల్: అత్తారింటికి వెళ్తూ బస్ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న వివాహిత అదృశ్యమైన ఘటనపై యలమంచిలి పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై కె సావిత్రి వివరాల ప్రకారం... కోటవురట్ల మండలం కైలాసపట్నానికి చెందిన పినపోతిన హైమ(27) సంక్రాంతి పండుగ సందర్భంగా ఇటీవల రాంబిల్లి మండలం వైలోవ గ్రామంలో పుట్టింటికి వచ్చింది. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటల సమయంలో కైలాసపట్నం వెళ్లడానికి భర్త దుర్గారావు, కుమార్తెతో కలిసి వైలోవ నుంచి యలమంచిలి బస్ కాంప్లెక్స్‌కు వచ్చారు. భార్య, కుమార్తెలను బస్టాండులో వేచి ఉండమని చెప్పి తన వద్ద ఉన్న చిరిగిపోయిన బ్యాగు కుట్టించుకు రావడానికి భర్త వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బస్ కాంప్లెక్స్‌లో తన కుమార్తె మాత్రమే ఏడుస్తూ కనిపించగా, భార్య హైమ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, తెలిసిన వారి వద్ద అదృశ్యమైన భార్య ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోయింది. దీంతో భర్త గురువారం యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్సై సావిత్రి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న సీఐ నరసింగరావు, ఎస్‌ఐ నాగేంద్ర

రాంబిల్లి(యలమంచిలి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్టు రాంబిల్లి సీఐ సిహెచ్..నరసింగరావు, ఎస్ఐ నాగేంద్ర గురువారం రాత్రి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న అర్ధరాత్రి రాంబిల్లి నేవీ గేట్ సమీపంలో గంజాయితో ఇద్దరు వ్యక్తులకు నేవీ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 235 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రాంబిల్లి పోలీసులకు అప్పగించారు. విచారణలో మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒడిశా రైతులకు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శిక్షణ



ఒడిశా రైతులకు చెరకు పంటపై అవగాహన కల్పిస్తున్న ఏడీఆర్ ముకుందరావు, ఇతర శాస్త్రవేత్తలు

అనకాపల్లి: చెరకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ జిల్లాకు చెందిన 25 మంది రైతులకు వారం రోజులపాటు చెరకు పంటపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. పరిశోధన స్థానంలో చెరకు పంట అభివృద్ధి పరచిన ఉత్తమ రకాలు, ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానం, సస్యరక్షణ, సస్య పోషణ జీవన రైతులు, జీవ నియంత్రణ పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యత, బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రెండు రోజులపాటు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శిక్షణ ఇచ్చిన అనంతరం, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెరకు పంట వేస్తున్న రైతుల వద్దకు తీసుకుని వెళ్లి చెరకు పంటపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, పి.వి.కె.జగన్నాథరావు, కె.వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన నర్సీపట్నం డీఎస్పీ



అనకాపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా నర్సీపట్నం డీఎస్పీగా నియమితులైన పి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీని విశాఖ డీఐజీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైభవంగా పెదనందిపల్లి సత్యదేవుని తీర్థం



ప్రత్యేక అలంకరణలో విజయ వెంకట సత్యనారాయణ స్వామి



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దేవరాపల్లి: పెదనందిపల్లిలో కొలువుదీరిన విజయ వెంకట సత్యనారాయణ స్వామి తీర్థం గురువారం వైభవంగా జరిగింది. రెండు రోజుల పాటు జరిగే తీర్థంలో భాగంగా తొలి రోజు పెందనందిపల్లి, చిననందిపల్లి, చేనులపాలెం, తారువా, తిమిరాం, మారేపల్లి, ఎం.అలమండ తదితర గ్రామాల ప్రజలతో పాటు ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామివారి దర్శన కోసం భక్తులు పోటెత్తడంతో ఆలయ మెట్ల మార్గంతో పాటు రోడ్లు కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండపై కొలువుదీరిన స్వామి వారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తదితర ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

చోడవరం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగిన జాతీయ స్థాయి 7వ ఓపెన్ తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో చోడవరంలో శిక్షణ పొందిన సహస్ర స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారుడు కొల్లిపార తన్విత్‌ఉదయ్ సబ్ జూనియర్స్ విభాగంలో పూమ్‌సేలో బంగారు పతకం, క్యోరుగి కాంస్య పతకాన్ని సాధించారు. పూమ్‌సే విభాగంలో జి.కారుణ్య సందీప్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. విజేతలకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన టీమ్ కోచ్‌లు కె.ప్రదీప్‌కుమార్, గండి శేఖర్‌బాబులను తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ టి.హర్షవర్ధన్ ప్రసాద్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి అభినందించారు.

కబడ్డీ పోటీల విజేత వైజాగ్ లయన్స్ జట్టు



విజేతగా నిలిచిన వైజాగ్ లయన్స్ జట్టును అభినందిస్తున్న గ్రామ పెద్దలు, యువకులు



ద్వితీయ స్థానంలో నిలిచిన కుర్లకోట జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న గ్రామ పెద్దలు

దేవరాపల్లి: సీతంపేటలో మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో వైజాగ్ లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ పోటీలు అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలలో కుర్లకోట జట్టు ద్వితీయ స్థానంలోను, కాకినాడ జట్టు తృతీయ స్థానంలోను, బొడ్డపాడు జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులను స్థానిక గ్రామ పెద్దలు, యువకలు బుధవారం అర్ధరాత్రి అందజేశారు. ఈ పోటీలలో 20 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల విజేత వాయిలపాడు



ఎడ్ల పందేలను పెద్ద సంఖ్యలో తిలకిస్తున్న ప్రజలు



ప్రథమ స్థానంలో నిలిచిన వాయిలపాడు ఎడ్ల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు: చౌడువాడలో సీతారామాంజనేయ తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు గురువారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 35 ప్రాంతాల నుంచి ఎడ్ల బళ్ల యజమానులు ఈ పోటీల్లో తలపడ్డారు. నిర్వాహకులు నిర్దేశించిన గమ్యాన్ని తక్కువ కాలవ్యవధిలో చేరుకున్న 20 ఎడ్ల బళ్ల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వాయిలపాడు ఎడ్ల బండి నిలిచింది. ఆ తరువాత స్థానాల్లో వరుసగా వల్లంపూడి, దేవరాపల్లి, లక్కవరం, ఎం.కొత్తపల్లి, ఎం.కొత్తపల్లి, వెంకువానిపాలెం, చుక్కపల్లి, ముద్దుర్తి, దేవరాపల్లికి చెందిన ఎడ్లు నిలిచాయి. ఈ పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు.

'మనిషన్నాక కాస్త కళాపోషణ ఉండాలి'..పనిచేసే రంగం ఏదైనా మనసుకు దగ్గరైన రంగం ఒకటుంటుంది. అందులో రాణిస్తే ఆ మజా వేరు.. రికార్డులు సృష్టిస్తే ఆ కిక్కే వేరు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు రైల్వే ఉద్యోగులు. తమ కళలతో కలలు సాకారం చేసుకుంటున్నారు. ముగ్గురూ ముగ్గురే అన్నట్టు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న మళ్ల శివ, కేఆర్ జగన్నాథ్, మోకా విజయకుమార్ కళలకు జీవం పోస్తున్నారు.
– తాటిచెట్లపాలెం(విశాఖ)

కళల రూపం

జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందుతున్న వాల్తేర్ డివిజన్ ఉద్యోగులు

ఆర్ట్ బై శివ



మళ్ల శివ..వాల్తేర్ డివిజన్‌లో లోకో పైలట్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా రైలును నడుపుతూ కిటికీల ద్వారా ట్రాక్‌ల పక్కన కనబడే పచ్చని వాతావరణాన్ని ఆస్వాదించే ప్రకృతి ప్రియుడు. విధులు ముగించుకుని వచ్చిన తరువాత చూసిన ప్రకృతి అందాలను కాన్వాస్‌పై ఆవిష్కరిస్తారు. ఇలా అనేక అందమైన కళలకు తన కాన్వాస్ ద్వారా రూపం ఇచ్చారు. ఈ విధంగా తాను వేసిన అందమైన చిత్రాలతో కోనసీమ చిత్ర కళా పరిషత్ ఆర్ట్ మ్యాగజైన్ (2025) సంచిక జనవరి 20న విడుదలైంది. ఇంతకు ముందు కూడా శివ రూపొందించిన మినియేచర్ చెస్ బోర్డు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఐదు లక్షల పెన్ డాట్స్‌తో తయారు చేసిన మదర్ థెరెసా చిత్రానికి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.

మిల్లెట్స్..'విజయకుమార్'



మోకా విజయ్ కుమార్..సీనియర్ టెక్నీషియన్. తన బహుముఖ ప్రజ్ఞాపాటవాలతో అనేక కళలకు జీవం పోశారు. ఈయన రూపొందించిన వినూత్న కళాఖండాలకు విశ్వవ్యాప్త గుర్తింపు లభించింది. పనికిరాని వస్తువులతో పలు కళాఖండాలు రూపొందించారు. పలు రంగులతో, మిల్లెట్స్‌తో ఈయన తయారు చేసిన 'మూడు రాష్ట్రాలు–మూడు సంస్కృతులు–ఒక డివిజన్' కళాఖండానికి మూడు అవార్డులు వరించాయి. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్స్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకుంది.

ప్రకృతి కవి 'జగన్నాథ్'



కేఆర్ జగన్నాథ్.. ఈయన కూడా వాల్తేర్ డివిజన్‌లో స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. ప్రయాణాలు, ప్రకృతి, సంస్కృతి, సామాజిక విషయాలపై కవితలను రాసి ఆకట్టుకుంటున్నారు. ఈయన తెలుగు సాహిత్యానికి చేస్తున్న కృషికి ప్రపంచ రచయితల ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమిల నుంచి 'తెలుగు కీర్తి' జాతీయ టాలెంట్ అవార్డును సొంతం చేసుకోనున్నారు. ఈ అవార్డును శ్రీ కొత్త పూర్ణానంద్ విలాస్ వేదిక, విజయవాడలో ఈ ఏడాది ఏప్రిల్ 21న అందుకోనున్నారు.





క్లుప్తంగా

ఉచిత పశు ఆరోగ్య శిబిరం


పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

కశింకోట: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ కోరారు. స్థానిక పశు వైద్య కేంద్రం వద్ద గురువారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ మంత్రి జయరజని ప్రారంభించారు. శిబిరంలో 28 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. 31 పెద్ద పశువులు, 22 లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సాగర్ కంపెనీ ట్రాఫిక్ బోర్డుల వితరణ


సీఐ స్వామినాయుడుకు స్టాప్, కాషన్ బోర్డులను అందజేస్తున్న జీఎం ప్రసాదరావు

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు రూ.2.35 లక్షల విలువ చేసే స్టాప్, కాషన్ బోర్డులను సమకూర్చింది. వీటిని సీఐ అల్లు స్వామినాయుడుకు పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎస్.వి. ప్రసాదరావు గురువారం అందజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడానికి బోర్డులను సమకూర్చిన సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి సీఐ కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమ ఏజీఎం హెచ్ఆర్ పీవీ పాండురంగారావు, సెక్యూరిటీ ఆఫీసర్ పి. అప్పారావు, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుల్లాట నిర్వాహకుడిపై కేసు

అనకాపల్లి: మండలంలో గొలగాం గ్రామంలో గుల్లాట ఆడిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ రవికుమార్ గురువారం చెప్పారు. నిందితుడి నుంచి రూ.1280లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 6,160 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,690	5,400
మొదటి రకం	3,580	4.400
రెండో రకం	3,100	3,760
మూడోరకం	2,900	3,070

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
హంగ్ కాంగ్ వారియర్స్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
ఐడెంటీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 63 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు , బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 413 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కూటమికి కన్ను కుట్టింది


సదరం సర్టిఫికెట్ ఉన్న నేత్ర రోగికి మరోసారి ఎన్టీఆర్ ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేస్తున్న విశాఖ కేజీహెచ్ నేత్ర వైద్యులు

- దివ్యాంగ పింఛన్ల తొలగింపు కోసం ప్రత్యేక క్యాంపులు
- 15 ఏళ్లుగా పొందుతున్న లబ్ధిదారుల ఆందోళన
- తొలిరోజు 75 మందికి అంధత్వ పరీక్షలు

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టి ఎనిమిది మాసాలు అవుతున్నప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. వీటి కోసం ఎంతోమంది వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో ఏళ్ల తరబడి పింఛన్లపై ఆధారపడి బతుకుతున్న దివ్యాంగులపై ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. ఉన్నపళంగా పాత పింఛన్ల తొలగించడానికి సదరం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు తిప్పలు...

15 సంవత్సరాలుగా నేత్ర సమస్యతో బాధపడుతున్న దివ్యాంగులకు అప్పట్లో విశాఖ కేజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్లు మంజూరయ్యాయి. అప్పటి నుంచి వాటి ద్వారా మండలంలో 150 మంది అంధులు దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. వీరి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం గ్రామ సచివాలయం ద్వారా నోటీసులు అందజేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి మండలంలో వివిధ ప్రాంతాల నుంచి నేత్ర సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన పింఛన్‌దారులకు మరోసారి తిప్పలు తప్పడంలేదు. రెండు రోజులుగా ఇక్కడ నేత్ర పరీక్షలు నిమిత్తం వచ్చిన వారికి సరైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కనీసం తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మొదటి రోజు 75 మందికి విశాఖ కేజీహెచ్ నుంచి వచ్చిన ముగ్గురు నేత్ర వైద్యులు అంధత్వ పరీక్షలు నిర్వహించారు.


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పుట్టుక నుంచి ఒక కన్ను గుడ్డి..



విశాఖ కేజీహెచ్‌లో 2010లో నేత్ర పరీక్షలు పూర్తి స్థాయిలో చేసి సదరం సర్టిఫికెట్ అందజేశారు. అప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నా. నేటి వరకూ ఏ ప్రభుత్వం వెరిఫికేషన్ చేయలేదు. అప్పటిలో నెలకు రూ.200 ఇచ్చేవారు. ఇటీవల గ్రామ సచివాలయం ఉద్యోగి మా ఇంటికి వచ్చి నాకు నోటీసు ఇచ్చి ఎన్టీఆర్ ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేయించుకుని మరోసారి సదరం సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పారు. కొంతమంది వ్యక్తులను అడిగితే పింఛన్ తొలగిస్తారని చెప్పడంతో భయం భయంగా ఉంది.

– మిండి చిన్నారావు, గొలగాం గ్రామం, అనకాపల్లి మండలం

వెరిఫికేషన్ కోసం ఇబ్బందులు



నాకు పుట్టిక నుంచి కుడి నేత్రం కనిపించలేదు. 2007లో కేజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వ పింఛన్ తీసుకుంటున్నా. మొదటిలో రూ.500లు పింఛన్ అందజేశారు. ప్రస్తుతం రూ.6 వేలు తీసుకుంటున్నాను. ప్రస్తుతం రెండో నేత్రం సరిగ్గా కనిపించడం లేదు. సచివాలయం ఉద్యోగి మా ఇంటికి వచ్చి ప్రస్తుతం సదర్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లాలని చెప్పడంతో గ్రామ యువకుడి సహాయంతో వచ్చాను. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఎవరూ పట్టించుకోలేదు. చాలా ఇబ్బంది పడ్డాను.

– పి.గంగమ్మ, గోపాలపురం, అనకాపల్లి మండలం

కంట్లో ధాన్యపు గింజ పడి కన్ను పోయింది



నా వయస్సు 58 సంవత్సరాలు 20 ఏళ్ల క్రితం పొలంలో వరికుప్ప నూర్పు చేస్తున్న సమయంలో కంట్లో గాలికి ధాన్యపు గింజ పడి కన్ను నీరుకారింది. రెండు సంవత్సరాలుగా కంటి వైద్యుల వద్ద మందులు వాడినప్పటికీ తగ్గలేదు. విశాఖ కేజీహెచ్‌లో కంటి ఆపరేషన్ చేసినప్పటికీ చూపు రాలేదు. 2017లో అక్కడ వైద్యులు సదరం సర్టిఫికెట్ అందజేశారు. దీని ద్వారా ప్రభుత్వ పింఛన్ తీసుకుంటున్నా. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెరిఫికేషన్ చేస్తే మొత్తం అన్ని పింఛన్లు చేయాలని, కొంతమందికి మాత్రమే చేయడం భావ్యం కాదు.

– చవితిని సన్నిబాబు, బవులవాడ గ్రామం, అనకాపల్లి మండలం

80 శాతం కనిపించడం లేదు



పుట్టినప్పటి నుంచి రెండు నేత్రాలు సరిగా కనిపించడం లేదు. మరో వ్యక్తి సహాయంతో మాత్రమే బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. గతంలో రెండు నేత్రాలకు ఆపరేషన్ చేశారు. ఫలితం లేకుండా పోయింది. 80 శాతం కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నానని సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ రూ.200 తీసుకున్నాను. ఇప్పుడు రూ.6 వేలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి చెవులు సరిగ్గా వినిపించడం లేదు. మాలాంటి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. ఈ రోజు తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయలేదు.

– టి.గోవింద, తల్లారివానిపాలెం, అనకాపల్లి మండలం

ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న గోవిందరావు

అనకాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు పారిశ్రామిక వేత్తలు కృషి చేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. గోవిందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో గురువారం రెండో రోజు పారిశ్రామికవేత్తలకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో తయారు చేసే ఉత్పత్తులను ఓఎన్‌డీసీలో ఏవిధంగా మార్కెటింగ్ చేసుకోవాలని, బ్రాండింగ్, రిజిస్ట్రేషన్, ప్యాకింగ్ వంటి విషయాలపై వివరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ నిర్మించరూ..


హైస్కూల్ వెనుకవైపు సైకిళ్లను పార్క్ చేసిన విద్యార్థులు

పరవాడ: ధర్మారాయుడుపేట జెడ్పీ హైస్కూల్లో సైకిల్ స్టాండ్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో 162 మంది విద్యా ర్థులు చదువుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి సైకిళ్లపై పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పాఠశాల లోపల, వారి సైకిళ్లను నిలిపే వీలుండేది. పాఠశాలకు అవసరమైన ఆట స్థలం లేకపోవడంతో పాఠశాల లోపలి ఖాళీ స్థలంలో చిన్న ఆట స్థలాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో లోపల ఉన్న సైకిల్ స్టాండ్‌ను పాఠశాల వెనుక భాగంలోకి మార్చారు. సైకిళ్లను ఆరు బయట వదిలిపెట్టడడంతో ఎండా, వానలకు పాడైపోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి పాఠశాల వద్ద సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో గౌరపరమేశ్వరుల ఉత్సవం

డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గౌరపరమేశ్వరులు ఉత్సవాన్ని నిర్వహించాలని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఈ నెల 25న నిర్వహించనున్న నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా గురువారం ఆమె ఆలయం వద్ద తమ సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి.అప్పారావు, పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, కొణతాల మహాలక్ష్మీనాయుడు, కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, దాడి కృష్ణ, సూరిశెట్టి నర్సింగరావు, బుద్ద భూలోకనాయుడు, కె.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆలయాన్ని పరిశీలించిన డీఎస్పీలు శ్రావణి, అప్పారావు, కమిటీ సభ్యులు

డీఎస్పీ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



నర్సీపట్నం : నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా పోతిరెడ్డి శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా, బొబ్బిలి డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ బదిలీపై నర్సీపట్నం డీఎస్పీగా నియమితులయ్యారు. ప్రస్తుత డీఎస్పీ మోహన్ నుంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేసిన అనుభవం ఉందన్నారు. శాంతి భద్రతలు కాపాడడం, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా కట్టుదిట్టం చేస్తామన్నారు. గంజాయి వ్యాపారుల ఆస్తులను సీజ్ చేస్తామన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ, ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి : మామిడిపల్లిలో మరిడిమాంబ తీర్థం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు, ఎడ్ల పోటీల విజేతలకు వరుసగా రూ.10 వేలు, 8 వేలు, 6 వేలు, 4 వేలు, 2 వేలు, వెయ్యి చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు.

గుల్లాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్


గుల్లాట ఆడుతూ పట్టుబడిన వ్యక్తులతో సీఐ పిన్నింటి రమణ తదితరులు

- వెదుళ్ల నరవలో నలుగురు, రావాడలో ఒకరు
- వారి నుంచి రూ.1.09 లక్షల నగదు స్వాధీనం

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్లనరవ శివార్లలో గుల్లాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వారి నుంచి రూ.1,05,530 నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు, నాలుగు గుల్ల, ఒక పట్టాను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గుల్లాట ఆడుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తనతో పాటు ఎస్ఐ దివ్య, సిబ్బంది కలిసి ఈ దాడులు నిర్వహించామన్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.


గుల్లాట నిర్వాహకుడితో పోలీసులు

రావాడలో నిర్వాహకుడి అరెస్ట్

పరవాడ: మండలంలోని రావాడ శివార్లలో గుల్లాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పరవాడ ఎస్ఐ మహాలక్ష్మి తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. గుల్లాటకు సిద్ధమవుతున్న నిర్వాహకుడు ఎర్రా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకు, అతడి నుంచి రూ.3,800 నగదు, గుల్లాటకు సంబంధించిన సామగ్రిని స్వాధీన పర్చుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహాలక్ష్మి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

తగ్గిన వంకాయ ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో వంకాయ ధర తగ్గింది. బెండకాయ ధర పెరిగింది. గత వారం కిలో వంకాయ రూ.80 ఉండగా, ఈ వారం రూ.60కి తగ్గింది. బెండకాయ రూ. 60 నుంచి 80కి పెరిగింది. టమాటా రూ.20, ఉల్లి, బంగాళదుంప, చామదుంప, దొండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.60 నిలకడగా ఉన్నాయి. బీన్స్, చిక్కుడు, పచ్చి బఠాణీ రూ.80, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి. గోబీపువ్వు రూ. 20 నుంచి రూ.30కి పెరిగింది.

భక్తి తత్వం ఎంతో గొప్పది


ప్రవచనం చేస్తున్న మురళీకృష్ణ

సింహాచలం: భక్తి తత్వం ఎంతో గొప్పదని ప్రముఖ హైందవ ప్రవచనకర్త కె.మురళీకృష్ణ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో 98వ వార్డు పరిధి గోపీజనవల్లభ స్వామి ఆలయంలో గురువారం భాగవత ప్రవచన కార్యక్రమం జరిగింది. ప్రవచనకర్త మురళీకృష్ణ హిందూ ధర్మం విశిష్టత, భక్తిభావం గురించి భక్తులకు వివరించారు. భాగవతం చదివినా, విన్నా పుణ్యం చేకూరుతుందన్నారు. ఆలయ నిర్వాహకుడు చాగంటి కోటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం


యలమంచిలి రూరల్: బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్ నాశనమవుతుందని జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు చెప్పారు. మండలంలోని పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం బాల్య వివాహాలు-అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, చైల్డ్ వెల్ఫేర్ శాఖ సేవల గురించి వివరించారు. మండల స్థాయిలో బాల్య వివాహాల నివారణకు ఒక కమిటీ ఉందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఎం శోభారాణి, రూప, సర్వేశ్వరరావు, నూకరాజు, జీవిత పాల్గొన్నారు.

నాటుసారా, మద్యం బాటిళ్ల పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు, నాటుసారా

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో శుక్రవారం పోలీసులు ఓ వ్యక్తి నుంచి నాటుసారా, మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొడ్డు చిన అప్పారావు వద్ద 3 లీటర్ల నాటుసారా, 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, అప్పారావును రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభం వద్ద చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధానార్చకుడు రంగరాజన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధానార్చకుడు సి.ఎస్.రంగరాజన్, దేవదాయశాఖ ట్రిబ్యునల్ సభ్యురాలు పద్మ స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.


ట్రిబ్యునల్ సభ్యురాలు పద్మకు ప్రసాదం అందిస్తున్న ఏఈవో

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


108 స్వర్ణ సంపెంగ పుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు.


నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు.

బందను పూడ్చేసిన మహిళపై కేసు నమోదు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట మధ్య వీధిలో బందను కప్పేసిన మహిళపై తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తిమ్మరాజుపేట సర్వే నంబర్-19లో సుమారు 80 సంవత్సరాల నుంచి గ్రామానికి సంబంధించిన మురుగునీరు, వర్షపునీరు నిల్వకు అనుకూలంగా బంద ఉండేది. సంక్రాంతి రోజుల్లో గాజువాకకు చెందిన యల్లపు అన్నపూర్ణ ఈ బందను గ్రావెల్‌తో కప్పేసింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్నపూర్ణపై చర్యలు కోరుతూ తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.